క్లుప్తంగా

జీఎస్‌రావుకు తోట పరామర్శ



హైదరాబాద్‌లోని ఏఐజీ హాస్పిటల్‌లో మాజీ ఎమ్మెల్యే జీఎస్‌రావును పరామర్శిస్తున్న తోట

తాళ్లపూడి: కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కేంద్ర కమిటీ సభ్యుడు జీఎస్ రావు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో ఆయనను వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు, రాష్ట్ర కాపు జేఏసీ మెంబర్ తోట రామకృష్ణ హైదరాబాదు గచ్చిబౌలి ఏఐజీ హాస్పిటల్‌లో పరామర్శించారు. జీఎస్ రావు ఆరోగ్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన తన రాజకీయ గురువు అని తోట తెలిపారు. ఆయనతో పాటు నిడదవోలు మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు, ప్రముఖ సినీ నిర్మాత నట్టెం సుబ్బారావు ఉన్నారు.

కార్మిక, కర్షక ఐక్యతను చాటాలి

నల్లజర్ల: మేడే వేడుకలను కార్మికులంతా జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు కొక్కిరపాటి వెంకట్రావు పిలుపునిచ్చారు. మంగళవారం గంటావారిగూడెం, దూబచర్ల, పుల్లలపాడు ప్రాంతాల్లో ఉన్న కర్మాగారాల్లో కార్మికులను కలుసుకుని మేడే వేడుకల ఆవశ్యకతను వివరించారు. మండలంలోని ప్రతి గ్రామంలో సీఐటీయూ జెండాలు ఆవిష్కరించాలన్నారు. కార్మిక, కర్షక ఐక్యతను చాటిచెప్పే విధంగా సభలు, సదస్సులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ నాయకులు వీరంకి నాగు, వీర్లశేషగిరి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నిడదవోలు : పట్టణంలో 33 కేవీ ఫీడర్ విద్యుత్ వైర్లు మార్చే పనులు చేపట్టేందుకు మంగళవారం ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో నిలిపివేస్తున్నట్లు నిడదవోలు విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు. పట్టణంలో సంజీవయ్య నగర్, లిటిల్ పారడైజ్ స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఆయన పేర్కొన్నారు.

కిశోర వికాసంపై శిక్షణ

నల్లజర్ల: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం కిశోర వికాసంపై మహిళా పోలీసులు, ఏఎన్ఎంలు, వీఓఏలు, ఆశ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీడీపీఓ నాగలక్ష్మి మాట్లాడుతూ 11–18 సంవత్సరాలలోపు కిశోర బాలికలకు మే 2 నుంచి జూన్ 10 వరకు ప్రతి మంగళ, శుక్రవారాల్లో గ్రామస్థాయిలో గ్రూపులుగా ఏర్పాటు చేసి బాల్యవివాహాలు నిర్మూలన, పోషకాహారం, వివిధ రుగ్మతలు, కెరీర్ గైడెన్స్, స్కిల్ డెవలప్‌మెంట్ అంశాలను వివరించి, అవగాహన కల్పిస్తారన్నారు. బడి బయట ఉన్న చిన్నారులను బడిలో చేర్పించే విధంగా చర్యలు తీసుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వెంకటలక్ష్మి, కృష్ణవేణి, హారతి, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కండక్టర్లకు ప్రోత్సాహకాలు



మహిళా కండక్టర్‌కు ప్రశంసాపత్రం అందిస్తున్న డీఎం వెంకటేశ్వర్లు

నిడదవోలు: ఆర్టీసీకి ఆదాయం సమకూర్చుతున్న ఆదర్శ కండక్టర్లను స్థానిక డిపోలో మంగళవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో అభినందించి వారికి నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాలను అందించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆర్టీసీ డిపో అభివృద్ధిలో కండక్టర్ల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. సంస్థకు ఆదాయం తీసుకువచ్చిన కండక్టర్లను ఆయన అభినందించారు. ఈ సమావేశంలో వివిధ అసోసియేషన్ నాయకులు, మెకానికల్, ట్రాఫిక్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

అధికంగా మద్యం తాగి వ్యక్తి మృతి

కొవ్వూరు: పట్టణంలోని ఓ బార్ ఎదురుగా ఖాళీగా ఉన్న ఇంటి అరుగుపై మస్కపల్లి సూరిబాబు అనే వ్యక్తి మంగళవారం మృతి చెందాడు. కోనసీమ అంబేడ్కర్ జిల్లా కపిలేశ్వరపురానికి చెందిన సూరిబాబు వడ్రంగి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొవ్వూరులో ఈయన సోదరుడు హరికృష్ణ ఉండడంతో ఈనెల 27న ఉపాధి నిమిత్తం ఇక్కడికి వచ్చారు. సోమవారం ఉదయం నుంచి సూరిబాబు మద్యం తాగుతూ ఎండలో తిరుగుతూ కుప్పకూలిపోయి మృత్యువాత పడ్డారు. హరికృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఆర్.సాంబమూర్తి తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నదీ తీరం.. పొంచి ఉన్న ప్రమాదం

- గోదావరి, కాలువల్లో స్నానాలు చేసేందుకు యువత ఆసక్తి
- మోగుతున్న మృత్యు ఘంటికలు
- స్నానానికి దిగి గల్లంతవుతున్న వైనం



శెట్టిపేట కాలువలో స్నానం చేస్తున్న చిన్నారులు



నిడదవోలు మండలం విజ్జేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద గోదావరిలో స్నానం చేయడానికి వచ్చిన జనసందోహం (ఫైల్)

నిడదవోలు రూరల్: వేసవి వచ్చిందంటే పిల్లలు, పెద్దలు గోదావరి నది, కాలువలు, చెరువుల్లో ఈత కొడుతూ, స్నానం చేస్తూ సేద తీరుతుంటారు. ఈత తెలిసిన వాళ్లకు సరదాగానే ఉంటుంది. నీళ్లంటే భయపడేవారు ఈత నేర్చుకోవడానికి ఇష్టపడరు. దీంతో ఈత రానివారు గోదావరి, కాలువల్లోకి దిగి ప్రమాదాల బారిన పడుతున్నారు.

తల్లిదండ్రులు అప్రమత్తంగా వ్యవహరించాలి

వేసవి వస్తే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని తీరప్రాంతాల్లోని ప్రజల్లో ఆందోళన నెలకొంది. విద్యార్థులకు కూడా ప్రస్తుతం సెలవులు ఇచ్చారు. దీంతో ఇంటి పట్టునే ఉండే విద్యార్థుల కదలికలపై తల్లిదండ్రులు దృష్టి సారించి అప్రమత్తంగా వ్యవహరించాలి. సెలవుల్లో బయటకు వెళ్లే పిల్లలే అధికం. విరామ సమయంలో చిన్నారులకు పూర్తి స్వేచ్ఛను ఇస్తే వారి భవిష్యత్, ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి ప్రమాదాల నుంచి పిల్లలను కాపాడడానికి పెద్దలు జాగ్రత్తలు పాటించాల్సిన అవసరముంది. గోదావరి తీరప్రాంతాలు కావడంతో నిడదవోలు, పెరవలి, కొవ్వూరు గోష్పదక్షేత్రం, విజ్జేశ్వరం బ్యారేజ్, తాళ్లపూడి మండలాల్లో వేసవి కాలంలో వేలాది మంది విద్యార్థులతో పాటు సందర్శకులు వచ్చి గోదావరిలో స్నానాలు చేయడంతో పాటు ఆహ్లాద వాతావరణం మధ్య ఆటలాడుకుంటారు. దీంతో ప్రమాదవశాత్తూ గోదావరి, కాలువల్లో జారిపడి మృత్యువాత పడటంతో బాధిత కుటుంబ సభ్యులకు శోకం మిగులుతోంది. ప్రస్తుతం కాలువలు మూసివేశారు. ఈ సమయంలో లంక పొలాల్లోకి వెళ్లే రైతులు, కూలీలు, కాలువల్లో ఉన్న నీటిలో స్నానాలు చేసే యువకులు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అప్రమత్తంగా లేకపోతే కాలువల్లోని గోతులు, ఊబిలో ఇరుక్కుపోయి పెనుప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది.

యువత ప్రాణం తీస్తున్న సరదా

ఈత సరదాలో ఎందరో ప్రాణాలు కోల్పోతున్నారు. ఏటా కొవ్వూరు, నిడదవోలు, పెరవలి మండలాల పరిధిలో గోదావరిలో స్నానానికి దిగిన అనేక మంది యువత ఏటా మృత్యువాత పడుతున్నారు. సెలవుల్లో మధ్యాహ్నం, సాయంత్రాల్లో, పాఠశాలలు తెరిచి ఉన్నప్పుడు ఆదివారం వచ్చిందంటే చాలు ఈ ప్రాంతంలో ప్రమాదకర ప్రదేశాల్లో స్నానాలకు దిగి ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల తాళ్లపూడి, కొవ్వూరు మండలాల్లో స్నానానికి దిగి యువత ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెందారు.

యువత, చిన్నారులు ఇలా చేయాలి

వేసవి వచ్చిందంటే ముఖ్యంగా గ్రామాల్లోని కాలువలు, నదులు ఈత కొట్టేవాళ్లతో నిండిపోతాయి. తెలియని వారికి ఈత నేర్పించేలా చేస్తే ప్రమాదం నుంచి కాపాడినవారమవుతాం. ఈత నేర్చుకోవడం ఆరోగ్యానికి ఎంతో మంచిది. స్నానానికి దిగేటప్పుడు వంతెనలు, గట్టు ఒడ్డు నుంచి తలకిందులుగా నీటిలోకి దూకకూడదు. పక్కనున్న రాళ్లకు, గట్టినేలకు తల ఢీకొంటే దెబ్బలు తగలడం, కొన్ని సందర్భాల్లో ప్రాణాలకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది. చెరువుల్లో దిగేముందు లోతు, నాచు, ఊబి తదితర అంశాలను పరిశీలించి తెలుసుకోవాలి. లేకుండా ఈత వచ్చినా ప్రమాదంలో చిక్కుకుంటారు. పిల్లలు ఈతకు వెళ్లినప్పుడు వీలైనంత వరకు తల్లిదండ్రులు ప్రమాదాలపై అప్రమత్తం చేయడంతోపాటు అవగాహన కల్పించాలి. కాలువల్లో ఈత, క్రికెట్ వంటి ఎండల్లో ఆటలను నిలువరించి యువత, చిన్నారుల దృష్టిని వేరే వ్యాపకాలపై మళ్లించాలి. ఇంటి వద్ద నీడపట్టునే ఉండి ఆడుకునే చదరంగం, క్యారమ్స్ తదితర ఆటలు ఆడుకునేలా ప్రోత్సహించాలి.

> **తల్లిదండ్రులే బాధ్యత తీసుకోవాలి**
>
> 
>
> గోదావరి, కాలువల్లో పిల్లలను స్నానాలకు పంపించకూడదు. ఈత రాని వారిని బలవంతంగా స్నానాలకు దింపకూడదు. వేసవి సెలవుల్లో చిన్నారులను ఇంటి వద్దే ఉండేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలి. ప్రమాదకరమైన ప్రదేశాల్లో స్నానాలను నిషేధించాలి. ప్రమాదకర రేవుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం.
>
> –కె.వీరబాబు, ఎస్సై, సమిశ్రగూడెం

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



దేవరపల్లి-యాదవోలు రోడ్డులో కొత్తగా వేసిన బోరు నీటిని పరిశీలిస్తున్న ఎంపీపీ కేవీకే దుర్గారావు

దేవరపల్లి: మండలంలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకున్నట్టు మండల పరిషత్ అధ్యక్షుడు కేవీకే దుర్గారావు తెలిపారు. సుమారు రూ.1.48 కోట్ల వ్యయంతో మంచినీటి పథకాలను చేపట్టినట్టు ఆయన తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ప్రతి పంచాయతీకి అదనపు మోటారు, పరికరాల కొనుగోలుకు మండల పరిషత్ నుంచి రూ. 23 లక్షలు మంజూరు చేసినట్టు ఆయన తెలిపారు. దేవరపల్లిలో మంచినీటి ఎద్దడి నివారణకు యాదవోలు రోడ్డులో మండల పరిషత్ నిధులు రూ.15 లక్షల వ్యయంతో బోరు, మోటారు, విద్యుత్ సర్వీసు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జలజీవన్ మిషన్ పథకంలో రూ.30 లక్షల వ్యయంతో పైపులైన్ నిర్మించినట్టు ఆయన వివరించారు. బోరును సోమవారం ట్రయల్ వేసినట్టు ఆయన తెలిపారు. రెండు రోజుల్లో ఆయా ప్రాంతాల ప్రజలకు సురక్షిత నీరు సరఫరా అవుతుందన్నారు. అచ్చియపాలెం రోడ్డులో జలజీవన్ మిషన్ నిధులు రూ.40 లక్షల వ్యయంతో బోరు, పైపులైన్ నిర్మించి మంచినీరు సరఫరా చేస్తున్నట్టు ఆయన చెప్పారు. ఇందిరమ్మ కాలనీలో రెండు బోర్లు పనిచేస్తున్నాయని, మోటారు, విద్యుత్ పరికరాల కొనుగోలుకు రూ. 5 లక్షలు మంజూరు చేసినట్టు ఆయన తెలిపారు. భాష్యం స్కూలు ప్రాంతంలో జలజీవన్ మిషన్ పథకంలో మంజూరైన రూ.40 లక్షలతో ఓహెచ్ఎస్సార్ ట్యాంకు, బోరు నిర్మించనున్నట్టు తెలిపారు. మూడు బొమ్మల సెంటర్లో మినీ వాటర్ ట్యాంకు నిర్మాణానికి రూ. 3 లక్షలు మంజూరు చేసినట్టు చెప్పారు. ట్యాంకు నిర్మాణానికి స్థల సేకరణ చేస్తున్నామని తెలిపారు. గ్రామంలో 12 పంచాయతీ బోర్లు ఉండగా, నాలుగు మంచినీటి బోర్లు ఉన్నాయని, మిగిలిన బోర్ల నుంచి సుద్దనీరు రావడం వల్ల తాడడానికి పనిచేయడంలేదని ఆయన అన్నారు. మరొక రెండు మంచినీటి బోర్లు అవసరం ఉందని ఆయన తెలిపారు. సత్యసాయిబాబా వాటర్ సరఫరాకు అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కడిమి వీరకుమారి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కడిమి రాజు, పంచాయతీ సభ్యుడు పచ్చా రాంగోపాల్, వైఎస్సార్ సీపీ నాయకులు కామిశెట్టి దుర్గారావు, దుగ్గిన గంగాధర్, దుగ్గిన ప్రసాద్, వెలగా శ్రీనివాస్ పాల్గొన్నారు.

కరాటే విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రదానం



దేవరపల్లి జెడ్పీ హైస్కూల్లో విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేసిన కేతా శ్రీనివాస్

దేవరపల్లి: స్థానిక అంబటి సత్యనారాయణరావు జిల్లా పరిషత్ హైస్కూల్లో మార్చి 9న నిర్వహించిన యోగాసనాలు, మార్షల్ ఆర్ట్స్‌తో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రాష్ట్రస్థాయిలో 250 మంది విద్యార్థులు పాల్గొనగా, గోపాలపురం నియోజకవర్గం నుంచి 69 మంది పాల్గొని ప్రతిభచాటారని మాస్టార్ జక్కంశెట్టి శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థులకు మంగళవారం జెడ్పీ హైస్కూలు ప్రాంగణంలో ఇండియా కేఏస్ మార్షల్ ఆర్ట్స్ చైర్మన్ కేతా శ్రీనివాస్ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ జక్కంశెట్టి శ్రీనివాస్, సీనియర్ కరాటే మాస్టర్స్ గంగాధర్, జక్కంశెట్టి ప్రసాద్, గూడూరి భాగ్యశ్రీ, ఎం.ప్రసాద్, సాయితేజ, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తే లక్ష్య సాధన సులభం



పెరవలి ఏపీఎం రామకృష్ణను సన్మానిస్తున్న డీఆర్డీఏ పీడీ ఎంవీఎన్ మూర్తి

పెరవలి: ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తే లక్ష్యాలను సులభంగా సాధించవచ్చని ఏపీఎం బండారు రామకృష్ణ నిరూపించారని డీఆర్డీఏ పీడీ ఎంవీఎన్ మూర్తి తెలిపారు. జిల్లాలో 15 స్థానంలో ఉన్న పెరవలి వెలుగు కార్యాలయాన్ని నేడు మొదటిస్థానంలోకి తీసుకువచ్చిన ఘనత ఏపీఎం బండారు రామకృష్ణదేనని డీఆర్డీఏ పీడీ కొనియాడారు. అనంతరం ఏపీఎంను మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరవలి వెలుగు కార్యాలయంలో తీసుకున్న రుణాలను సక్రమంగా సకాలంలో లబ్ధిదారులు తిరిగి చెల్లించడంలో, రుణాల మంజూరులో జిల్లాలోనే పెరవలి వెలుగు కార్యాలయం ముందంజలో ఉందని తెలిపారు. స్త్రీనిధి నిధుల అంశంలో జిల్లాలో ప్రథమ స్థానంలో పెరవలి మండలం ఉందని తెలిపారు. స్త్రీనిధి గతేడాది లక్ష్యం రూ.8 కోట్లు ఉంటే దానిని రూ.8.5 కోట్లకు తీసుకువెళ్లిన ఘనత రామకృష్ణదేనన్నారు. రికవరీ నూరుశాతం పూర్తి చేసారని చెప్పారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఉన్నతాధికారుల సహాయ సహకారాలతో లక్ష్యాలను సాధించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏజీపీ ధర్మేంద్ర, డివిజన్ స్త్రీనిధి మేనేజర్ రత్నమాల పాల్గొన్నారు.

జ్యోతి కాలనీలో విద్యుత్ శాఖాధికారుల పర్యటన

సాక్షి ఇంపాక్ట్

నిడదవోలు : పట్టణంలో జ్యోతి కాలనీలో క్షేత్రస్థాయిలో మంగళవారం నిడదవోలు విద్యుత్ అధికారులు పర్యటించారు. ఈనెల 28న 'నిరంతర విద్యుత్ కోతలు' శీర్షికన సాక్షిలో ప్రచురించరించిన కథనానికి ఏపీఈపీడీసీఎల్ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.తిలక్ ఆదేశాలతో నిడదవోలు విద్యుత్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీఈపీడీసీఎల్ నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.నారాయణఅప్పారావు మాట్లాడుతూ ప్రతిరోజూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో 132 కేవీ నిడదవోలు సబ్‌స్టేషన్ ఈనెల 24న సాయంత్రం ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడంతో దానిస్థానంలో కొత్త వాటిని భర్తీ చేయడం వల్ల సాంకేతిక సమస్యతో జ్యోతి కాలనీకి సంబంధించిన తీరుగూడెం 11 కేవీ ఫీడర్ విద్యుత్ సరఫరాలో 38 నిమిషాలు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు. ఈ పది రోజుల్లో ఎటువంటి అంతరాయం లేదని ఆయన పేర్కొన్నారు. విద్యుత్ మరమ్మతుల నిర్వాహణ సమయంలో సంబంధిత వినియోగదారులకు ముందస్తు సమాచారం ఇస్తూనే వేసవిలో ఎటువంటి విద్యుత్ కోతలు లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తునట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ నిడదవోలు టౌన్ ఏఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పడవలకు లైసెన్స్‌లు తప్పనిసరి

కొవ్వూరు: గోదావరిలో చేపల వేట సాగిస్తూ జీవనం పొందే మత్స్యకారులు తాము వినియోగించే పడవలు, తెప్పలు, విసురు వలలకు ఏటా విధిగా లైసెన్స్‌లు తీసుకోవాలని జిల్లా మత్స్య శాఖాధికారి, జాయింట్ డైరెక్టర్ ఎస్.నిర్మలకుమారి సూచించారు. పట్టణంలో వీబీపీ ఘాట్ వద్ద మంగళవారం మత్స్యకారులకు ఆమె అవగాహన సదస్సు నిర్వహించారు. నిబంధనలు పాటించకుంటే లైసెన్స్‌లు రద్దు చేస్తామని ఆమె హెచ్చరించారు. అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్ షేక్ దిల్షాద్, పట్టణ సీఐ పి.విశ్వం, టూరిజం డిపార్టుమెంటు ప్రతినిధి అన్వర్, మత్స్యశాఖ సహాయ తనిఖీ అధికారి పి.కృష్ణవేణి పాల్గొన్నారు.

మద్యం తాగి కొట్లాట

కొవ్వూరు: పట్టణంలోని బస్టాండ్ సెంటర్ వద్ద మంగళవారం ఇద్దరు వ్యక్తులు మద్యం తాగి కొట్టుకున్నారు. ఈ కొట్లాటలో ఇందిరమ్మ కాలనీకి చెందిన ప్రగడ పోసిబాబుకు కంటి వద్ద తీవ్ర గాయమైంది. పట్టణానికి చెందిన త్రిమూర్తుల ఈశ్వరరావు (బంటి) మద్యం మత్తులో బీరు బాటిళ్లతో పోసిబాబుపై దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు.


గంగానమ్మాతల్లీ.. కరుణించమ్మా



గంటావారిగూడెంలో గంగానమ్మ జాతరలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

నల్లజర్ల: గంటావారిగూడెం గ్రామదేవత గంగానమ్మ జాతరను వైభవంగా నిర్వహిస్తున్నారు. గంగానమ్మాతల్లికి భక్తులు మొక్కులు చెల్లించి పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ తూర్పుగోదారి జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్, రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జ్ గూడూరి శ్రీనివాసరావు, మాజీ హోంమంత్రి తానేటి వనిత తదితరులు మంగళవారం రాత్రి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ఈలప్రోలు చంద్రరావు, ఇమ్మణ్ణి సత్తిపండు, శ్రీకాకుళపు ఆదిత్య గుత్తుల అప్పారావు తదితరులు వారికి ఘన స్వాగతం పలికారు. మండల కన్వీనర్ వెల్లంకి వెంకటసుబ్రహ్మణ్యం, నాయకులు బంక అప్పారావు, వై.వాసు, ముప్పిడి వెంకటరత్నం, మట్టా రాజేష్, కరుటూరి సురేష్, కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోడ్ ముగిసినా తొలగని ముసుగు



నిడదవోలు వైఎస్సార్ నగర్‌లో ముసుగు తొలగించని డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం

నిడదవోలు: ఉభయగోదావరి ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఫిబ్రవరిలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తరువాత పట్టణంలో వైఎస్సార్ నగర్‌లో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి మున్సిపల్ అధికారులు ముసుగు వేశారు. ఎన్నికల కోడ్‌ను కచ్చితంగా అమలు చేశారు. ఇంత వరకు బాగానే ఉంది. ఎమ్మెల్సీ ఎన్నికల అనంతరం ఫలితాలు వెలువడి చాలా రోజులైంది. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ముసుగు తొడిగి సుమారు రెండు నెలలు కావస్తున్నా ఇంత వరకు తీయలేదు. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లోపించడంతో పట్టణంలో అన్ని విగ్రహాలకు ముసుగులు తొలగించినా వైఎస్సార్ విగ్రహానికి ముసుగు అలాగే ఉంచడంతో స్థానికులు, వైఎస్సార్ అభిమానులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ముసుగును తొలగించాలని పలువురు కోరుతున్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరం

నల్లజర్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో గురువారం విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. 20 మంది విద్యార్థులు హాజరై క్యారమ్స్, వివిధ రకాల ఆటలు, చెస్, జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించిన అంశాలు నేర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో షేక్ బాజీ, వనమాలి, గ్రంథపాలకురాలు ఏవీ రమణ పాల్గొన్నారు.

ఆంగ్లంపై పట్టు సాధించాలి

పెరవలి: గ్రంథాలయాలు విజ్ఞాన గనులని వీటిని సద్వినియోగం చేసుకుంటే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని రిసోర్స్ పర్సన్ కామేశ్వరరావు పేర్కొన్నారు. ముక్కామల శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా మంగళవారం పెరవలి, ముక్కామల, తీపర్రు శాఖా గ్రంథాలయాల్లో ఆంగ్లంపై ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఆంగ్ల భాషపై చిన్నప్పటి నుంచి అవగాహన ఉంటే భవిష్యత్తులో ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. ఏకాగ్రత పెరగాలంటే విద్యార్థులు యోగా సాధన చేయాలని యోగా మాస్టారు కరుటూరి విశ్వనాథం తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికార్లు యు వెంకటేశ్వర్లు, జయలక్ష్మి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బీచ్ కబడ్డీ జట్ల ఎంపిక



బీచ్ కబడ్డీ పోటీలకు ఎంపికైన స్త్రీ, పురుష జట్లతో కబడ్డీ అసోసియేషన్ సభ్యులు

నల్లజర్ల: రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీలకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జట్లను ఎంపిక చేసినట్టు కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కొత్తపల్లి అప్పలరాజు, యలమరెడ్డి శ్రీకాంత్ తెలిపారు. ఈనెల 28న తీపర్రులో ఈ ఎంపికల పోటీలు నిర్వహించినట్టు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 100 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారని, ఒక్కో జట్టుకు ఆరుగురు చొప్పున ఎంపిక చేసినట్టు చెప్పారు.ఎంపికైన జట్లు మే 2,3,4 తేదీల్లో కాకినాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీలో పాల్గొంటారన్నారు. ఈ పోటీలను ఎస్.సత్యనారాయణ ప్రారంభించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మేకా రంగారావు, సంకు సత్యనారాయణ, వాటాల వెంకటేశ్వరావు, మల్లాడి రాంబాబు, కె.రంగారావు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇప్పిస్తానని టోకరా

ఇద్దరి నుంచి రూ.3,81,999 కాజేసిన కేటుగాటు

కొవ్వూరు: పట్టణంలో యనాది కాలనీకి చెందిన మద్రి రామచంద్రం అనే వ్యక్తికి రైల్వే ఉద్యోగం ఇప్పిసానని సొమ్ము తీసుకుని మోసగించిన విశాఖపట్నం జిల్లా చోడవరానికి చెందిన మీసాల అప్పలరాజుపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. కొవ్వూరులో డిగ్రీ చదువుతున్న రామచంద్రం సోదరి విశాఖ పట్నంలో ఓ రెస్టారెంట్ పనిచేస్తుంది. అదే రెస్టారెంట్‌లో పనిచేస్తున్న అప్పలరాజు తాను రైల్వేలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించాడు. దీంతో తన సోదరుడికి ఉద్యోగం కావాలంటూ విడతల వారీగా అప్పలరాజుకు సొమ్ము ముట్టజెప్పారు. రాజమహేంద్రవరం రూరల్ పరిధిలో పిడింగొయ్యి ప్రాంతానికి చెందిన సుబ్బన్న కుమారుడికి ఉద్యోగం ఇప్పిస్తానని అతని వద్ద నుంచి అప్పలరాజు రూ.1.50 లక్షలు తీసుకున్నట్లు రామచంద్రం ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇద్దరి వద్ద విడతల వారీగా రూ.3,81,999 వసూలు చేసి అనంతరం ఫోన్ చేసినా సమాధానం చెప్పడం లేదని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. నిందితుడు ఉద్యోగం పేరుతో తమను మోసగించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారని బాధితుడు రామచంద్రం తెలిపారు.